క్లుప్తంగా

'కట్ట'నిధులతో బోరు పంపు ఏర్పాటు



పోచవరం బీసీ కాలనీలో బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని పోచవరం గ్రామంలోని బీసీ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికై సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కట్ట వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం.. భార్య సుగుణమ్మ, కుటుంబ సభ్యులు సొంత నిధులతో బోరు పంపు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కుమారుడు, కల్లూరు మాజీ జెడ్పీటీసీ అజయ్‌కుమార్, గ్రామ ప్రముఖులు జనార్దన్, ప్రసాద్, సత్యం, మాధవరావు, బారిష్టర్, మాజీ సర్పంచ్ వెంకట్, తిరుపతిరావు, వీర రాఘవచౌదరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



అఖిలకు రూ.60 వేల చెక్కు అందిస్తున్న దృశ్యం

కల్లూరు: మండల పరిధిలోని యజ్ఞనారాయణపురం గ్రామానికి చెందిన కంచెపోగు రమేష్ (లేటు) కుమార్తె అఖిల ఖమ్మం పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ సెకండ్ ఇయర్ చదువుతుంది. చదువుకునేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవడంతో వారు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావును సంప్రదించారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించిన రామారావు.. ఫౌండేషన్ అధినేత శ్రీవ్యాల్ దృష్టికి తీసుకెళ్లి.. వారి ద్వారా రూ.60 వేల చెక్కును అఖిలకు అందజేశారు.

ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర పర్యటన



కృష్ణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ: మండలంలో ఆదివారం ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. వారు అన్నారుగూడెంలో పదాల సైదులు, మౌనిక దంపతుల కుమార్తె, కుమారుడు నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం వెంకటవీరయ్య తల్లాడలో బీజేపీ మండల అధ్యక్షుడు చల్లా నాగులు తండ్రి కృష్ణయ్య, గ్రామానికి చెందిన తౌడపు సైదమ్మ ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తల్లాడ మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, వెంకట్‌లాల్, కోటిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, రఘు, వీరకృష్ణ, జీవీఆర్ పాల్గొన్నారు.

జగదీష్ కుటుంబానికి పరామర్శ

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు వట్టికూటి జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆదివారం జగదీష్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, గోపి, వెంకటేశ్వర్లు, వీరభద్రం, మజీద్, కోటేశ్వరరావు, శ్యాంసుందర్, రవి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బండి మార్థవ్‌రెడ్డికి నివాళి..

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బండి చెన్నకేశవరెడ్డి కుమారుడు బండి మార్థవ్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌లు వేర్వేరుగా మార్థవ్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వనమారెడ్డి నాగిరెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, మలిరెడ్డి మురళీరెడ్డి, చెన్నారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు..

కారేపల్లి: మండలంలోని గాదెపాడు అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ మహబూబీ రోడ్డు ప్రమాదంలో ఈనెల 21న మృతి చెందింది. ఆదివారం ఆమె అంత్యక్రియలకు తోటి అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, సీఐటీయూ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు నాగమణి, పాపారాణి, సీఐటీయూ నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, నరేంద్ర, ఇస్మాయిల్, ఐద్వా నాయకురాళ్లు ఉమావతి, ఉపేంద్ర, రామ్మూర్తి, లక్ష్మణ్, రామారావు, రామచంద్రయ్య, మంగయ్య, సర్కిల్ లీడర్స్ శ్రీలక్ష్మి, అరుణ, రాణిలు ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.



ప్రమాదకరంగా ఉన్న అయ్యగారపల్లి - గంధసిరి రోడ్డు మలుపు



బాణాపురం సమీపంలోని..

సూచికలు కరువై.. ప్రమాదాలకు చేరువై..!

- మూలమలుపుల వద్ద మృత్యుపాశాలు
- పాతరోడ్లన్నీ కంకరతో గుంతలమయం
- హైవేపై రోజుకో ప్రమాదం.. వాహనదారుల్లో హైరానా
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

ముదిగొండ: మండలంలోని పలు జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల్లోని ప్రమాదకర మలుపుల, వంతెనలు వద్ద సూచికల ఏర్పాటు చేయకపోవటంతో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. సూచికలు లేక రాత్రిళ్లు వేగంగా వచ్చే వాహన చోదకులకు మలుపులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

మలుపులు ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

మండలంలోని ముదిగొండ, సువర్ణాపురం, చిరుమర్రి, న్యూలక్ష్మీపురం, వనంవారికిష్టాపురం, అమ్మపేట, కమలాపురం, అయ్యగారిపల్లి, బాణాపురం, పెద్దమండవ, వల్లబి, మల్లారం వరకు మూలమలుపులు ఉన్న గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. అదే విధంగా వెంకటాపురం, మేడేపల్లి క్రాస్ రోడ్డు, సువర్ణాపురం, చిరుమర్రి, న్యూలక్ష్మీపురం, వనంవారికిష్టాపురం, మల్లారం, వల్లబి సమీపంలోని క్రాసింగ్ వద్ద జంక్షన్లలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు.

- రాత్రి వేళల్లో హైవేపై లైట్లు లేకపోవడంతో ముదిగొండ, వెంకటాపురం, గోకినేపలి వద్ద గేదెలను ఢీకొట్టి మరణించిన వారు, క్షతగ్రాతులు అయినవారు చాలా మంది ఉన్నారు. అంతే కాకుండా రహదారుల వెంట ముళ్ల పొదలు చిట్టడవిని తలపించే విధంగా ఉన్నాయి. వాటి పక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రహదారులు ప్రమాదకరంగా ఉన్నా సూచికలు మాత్రం ఏర్పాటు చేయటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాద వివరాలిలా..

- ఇటీవల పెద్దమండవ - బాణాపురం సమీపంలో మూలమలుపు కనిపించకుండా ఉండడంతో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో అక్కడికక్కడే ఓ ద్విచక్రవాహన దారుడు మృతి చెందగా, మరో వాహనదారుడికి తీవ్రగాయాలు అయ్యాయి.
- గతేడాది వనంవారికిష్టాపురం వద్ద ట్రాక్టర్ డోజర్ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో యువకుడి ప్రాణాలు గాలిలో కలిశాయి.
- వెంకటాపురం సమీపంలోని మేడేపల్లి క్రాస్ రోడ్డు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరి దంపతులకు గాయాలైయ్యాయి.

కావున ఇకనైనా సంబంధిత అధికారులు మూలమలుపుల వద్ద, క్రాసింగ్‌ల వద్ద, జంక్షన్లలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా జీబ్రా గుర్తులు అమర్చాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరగకుండా చూడాలి..



మూలమలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ రహదారుల వద్దకు వెళ్లగానే, భయంగా ఉంటుంది. సూచిక బోర్డులు లేక ఇప్పటికే చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారు. రోడ్లు గుంతలు పడి ధ్వంసం అయినా అధికారులు పట్టించుకోవటం లేదు. వాహన చోదుకుల ఇబ్బందులను తొలిగించాలి.

– కందిమళ్ల రామారావు, పెద్దమండవ

అధికారులు స్పందించాలి..



అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. అతివేగమే ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. కొత్తగా గ్రామాల్లోకి వచ్చే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో రహదారులకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– మీగడ శ్రీనివాస్‌యాదవ్, గోకినేపల్లి

ప్రయాణం.. ప్రమాదమే



ప్రమాదభరితంగా ఉన్న బీబీసీ బ్రిడ్జి

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని బోనకల్ - చిరునోముల ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఈ బ్రిడ్జిపై బోనకల్ నుంచి చిరునోముల, చొప్పకట్లపాలెంతో పాటు ఆంధ్రాలోని దబ్బాకుపల్లి, పెంట్యాలవారిగూడెం తదితర గ్రామాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి అడుగుభాగం చువ్వలు తేలడంతో పాటు సైడ్‌వాల్స్‌కూడా శిథిలమయ్యాయి. ఇది ఎప్పుడు కూలుతుందోనని ప్రయాణికులు తమ ప్రాణాలకు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానం..



కల్లూరు పుణ్యాపురం కాలువ పక్కన అధ్వానంగా తయారైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

కల్లూరురూరల్: కల్లూరు నుంచి మధిర వెళ్లే అంతరాష్ట్రీయ రహదారి అధ్వానంగా తయారైంది. కల్లూరులోని ఎన్నెస్పీ పుణ్యాపురం మేజర్ కాలువ సమీపంలో మధిర వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. నిత్యం వందలాది వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణాలు చేస్తుంటారు. కల్లూరు నుంచి మధిర వరకు సుమారు 45 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు బీటీ రోడ్డు మరింత పాడైపోతుంది. ముఖ్యంగా కల్లూరు నుంచి జీడీబీపల్లి వరకు రోడ్డు గుంతలు పడి భీభత్సంగా తయారైంది. ఎదైనా ప్రమాదం జరగకముందే ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎర్రా బాబు

వైరా: వైరా మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించి డ్రైయినేజీ, రహదారులు అభివృద్ధి చేసి మౌళిక వసతులు కల్పించాలని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు డిమాండ్ చేశారు. ఆదివారం షేక్ షరీఫ్ (మైక్ బాబు) అధ్యక్షతన నిర్వహించిన మున్సిపాలిటీ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. వైరా మున్సిపాలిటీ విస్తరణ కోసం పలు గ్రామాలను విలీనం చేశారన్నారు. ఆయా విలీన గ్రామాలలో డ్రైయినేజీలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీ వర్కర్లకు నెల నెలా జీతాలు రాక వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు వచ్చాయన్నారు. వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో సీపీఐకి బలం ఉన్న వార్డుల్లో పోటీ చేసి సీపీఐ సత్తా చాటాలన్నారు. అనంతరం పట్టణ కమిటీ శాఖ కార్యదర్శిగా మిట్టపల్లి రాఘవరావు, సహాయ కార్యదర్శి గారపాటి అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యామాల గోపాలరావు, జిల్లా నాయకుడు పీవీ రావు, పట్టణ నాయకులు కొండా రామకృష్ణ, మూటకొండా, మోర్ శ్రీనివాసరావు, మోరె ప్రభాకర్, నాని, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగూర్ వలి

మధిర: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మధిరలోని టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన మండల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-కుబేర్ పెండింగ్ బిల్లులను తక్షణమే జమచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికై సంఘ నాయకులు గ్రామాల్లో విద్యాయాత్ర పేరుతో బడిబాట నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ వినోదరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, వీరయ్య, ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీం, కాజా సునీత, కోశాధికారి బైర్ల చెన్నయ్య, మండల కార్యదర్శులు యండి రఫి, రాణి, కవిత, రాజు, షేక్ లాల్ అహ్మద్, కొండలరావు, ఆదాం, నాగేశ్వరరావు, రాంబాబు, గోపీచంద్, రాణి, భూలక్ష్మి, కృష్ణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు



ఎస్సై పుష్పాల రామారావుకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘం నాయకులు

వైరారూరల్: అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని కేజీ సిరిపురంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కేజీ సిరిపురం గ్రామ ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి చూపుడు వేలు, ముక్కు భాగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో దళిత సంఘం నాయకులు ఆదివారం వైరా ఎస్సై పుష్పాల రామారావుకు ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్సై రామారావు, ట్రైయినీ ఎస్సై పవన్‌కుమార్ కేజీ సిరిపురం గ్రామానికి వెళ్లి విచారణ జరిపించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దాంతో ఎస్సై రామారావు మాట్లాడుతూ.. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మట్టా దయానంద్

కల్లూరురూరల్: మండలంలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ ఆదివారం భూమిపూజ చేశారు. ఆయన వెంట కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు శేషగిరిరావు, అర్జున్‌రావు, శ్రీమన్నారాయణ, నరేంద్ర, అన్నంరాజు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న డీపీఆర్ ట్రస్ట్ సభ్యులు

కల్లూరు: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన డీపీఆర్ ట్రస్ట్ చైర్మన్ దేవరపల్లి పట్టాభి జన్మదినాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులు దేవరపల్లి నాగప్రసాద్, మాజీ సర్పంచ్ దేవరపల్లి అరుణల ఆధ్వర్యంలో ఖమ్మం సంకల్ప ఆస్పత్రి సౌజన్యంతో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. 150మంది యువకులు స్వచ్ఛందగా రక్తదానం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చంద్రుపట్ల రోడ్‌లో సీడీఐ కార్యదర్శి పి.ఎనోష్‌కుమార్ అనాథాశ్రయంలోని పిల్లలకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, దేవరపల్లి భాస్కర్ రావు, పెడకంటి రామకృష్ణ, మేకల కృష్ణ, బోబోలు లక్ష్మణరావు, ఎస్‌కే కమ్లి, సీహెచ్ కిరణ్‌కుమార్, కళ్యాణ్ కిషోర్, దేవరపల్లి మురళీకృష్ణ, వేము కృష్ణ, మట్టూరి స్టాలిన్, దేవరపల్లి కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



వైరా: బ్రాహ్మణపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామారావు

వైరా: డ్రగ్స్ రహిత సమాజానికై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైరా ఎస్సై పుష్పాల రామారావు అన్నారు. ఆదివారం వైరా మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి గుట్కా వంటి మత్తుపదార్థాల బారిన పడి యువతీ యువకులు చిన్న వయసులోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లి దండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది స్థానిక యువత పాల్గొన్నారు.

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్ కారేపల్లి పోలీసు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని.. ఎస్సై-2 కోట కోడెత్రాచు యువతకు అవగహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైయినీ ఎస్సై కిరణ్, కానిస్టేబుల్‌లు సీతారాములు, సుధాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బోనకల్: అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకన్న

బోనకల్: డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణ లక్ష్యంలో యువత భాగస్వాములై కృషి చేయాలని ఎస్సై పి.వెంకన్న అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో యువతకు మత్తుపదార్థాల నిషేదంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశంపైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందన్నారు.

మహిళా గురుకులంలో 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న బాలికలతో యాజమాన్యం

కొణిజర్ల: డ్రగ్స్ నిషేదం గురించి అవగాహన కల్పిస్తూ.. మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆదివారం 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రజిత ప్రారంభించారు. గురుకుల కళాశాల నుంచి తనికెళ్ల సెంటర్ వరకు పరుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారి నుంచి యువత బయట పడాలన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.రజిత, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ శోభాదేవి, పీడీ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయక మందిర వార్షికోత్సవం



వినాయక మందిరంలో పూజలు చేస్తున భక్తులు

వైరా: వైరాలోని వరసిద్ధి వినాయక మందిర 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, గోపూజ నిర్వహించారు. వాసవీ నటరాజ బృందం వారు భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైరా అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ మాదినేని సునీత, ఏపూరి రాజారావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మందిర చైర్మన్ పుష్పాల అనంత రామయ్య, సెక్రటరీ రంగా సత్యనారాయణ, లగడపాటి బోసు, మాదినేని దుర్గాప్రసాద్, రాయపూడి వెంకటేష్, నల్లమోతు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



తల్లాడలో చెక్కు అందిస్తున్న రఘుపతిరెడ్డి

తల్లాడ: తల్లాడ పట్టణంలో ఆదివారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి పంపిణీ చేశారు. తల్లాడకు చెందిన కుసుమరాజు రమణ, సునీత, మూడు సురేష్, మోతి కుమారి, షేక్ రబియాకు చెక్కులు అందించి మాట్లాడారు. ప్రైవేట్ హాస్పటల్‌లో వైద్యం చేయించుకొని సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ చెక్కులు అందించడం జరిగిందన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సహకారంతో లబ్ధిదారులకు చెక్కులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములుగుమాడులో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ గంటా తిరుపతమ్మ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ అల్లు పుల్లారావు, డాక్టర్ అనితారాణి, డాక్టర్ కీర్తిలు రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కంటి, దంత వైద్య పరీక్షలు చేశారు. చర్మ వ్యాధులకు గురైన రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో గంటా శ్రీనివాసరావు, జిల్లేపల్లి బాబురావు, తదితరులున్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- శిథిలావస్థకు చేరిన వైనం..
- చోద్యం చూస్తున్న అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న పంచాయతీ కార్యాలయం



పల్లిపాడులో నిరుపయోగంగా ఉన్న పల్లె దవాఖానా భవనం

కొణిజర్ల: పంచాయతీల్లో ఏఒ పనికోసం నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పల్లిపాడు పంచాయతీగా ఉన్న సమయంలో దాదాపు 20 ఏళ్ల క్రితమే పల్లిపాడు సెంటర్‌లో రోడ్డు పక్కనే పశువుల ఆస్పత్రి పేరుతో భవనం నిర్మించారు. రెండేళ్ల పాటు వైద్య పరీక్షలు కూడా చేశారు. ఆ తర్వాత ఆస్పత్రి ఎత్తి వేయడంతో ప్రైవేట్ వ్యక్తులు కొంత కాలం అందులో నివాసం ఉన్నారు. స్థానికులు అభ్యంతరంతో దాదాపు పుష్కర కాలంగా నిరుపయోగంగా మారింది. ఇటీవల దానికి వైరా మున్సిపాలిటీ స్క్రాప్ రూమ్ కింద పాడైపోయిన బల్బులు, పైపులు వేసి ఉంచుతున్నారు.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే..

- 2017 సంవత్సరంలో.. రూ.12లక్షల వ్యయంతో పల్లిపాడు పంచాయతీని నిర్మించారు. రంగులు మాత్రమే మిగిలి ఉంది. ఆ సమయంలో పంచాయతీని ప్రభుత్వం వైరా మున్సిపాలిటీలో విలీనం చేయగా.. కాంట్రాక్టర్ మిగిలన పనులను వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఆభవనం శిథిలావస్థకు చేరుకుంది.
- బీఆర్‌ఎస్ హయాంలో పల్లెదావఖాన భవనం నిర్మించారు. కానీ దాని పక్కనే స్మశాన వాటిక ఉండడంతో స్థానికులు పనులు నిలిపివేయాలని అభ్యంతరాలు తెలిపినా అధికారులు పనులు పూర్తి చేశారు. దానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఉన్న రోడ్డంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వానాకాలంలో చెరువును తలపిస్తోంది. దీంతో గ్రామంలో అద్దె భవనంలో పట్టణ, పల్లె దవాఖానా నిర్వహిస్తున్నారు.
- ఆ పక్కనే చెత్త వేరు చేసేందుకు నిర్మించిన మున్సిపల్ భవనం నిరుపయోగంగా మారింది.
- పల్లిపాడు శ్మశాన వాటికలో ఎలక్ట్రిక్ శ్మశాన వాటిక కోసం భవనం నిర్మించారు. కానీ ఎటువంటి పనులు చేపట్టక భవనం నిరుపయోగంగా పడి ఉంటుంది.

ఇలా పల్లిపాడులో ఏ భవనం కట్టినా అది ఓపెనింగ్ చేయకుండా శిథిలావస్థకు చేరకుంటుంది. దీనిపై అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.